విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

జగనన్న కాలనీలలో మౌళిక వసతులేవి...?

విశాలాంధ్ర - అచ్యుతాపురం: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల నిర్మాణాలలో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశాలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మత్స్యకార గ్రామమైన పూడిమడకలో జగనన్న కాలనీల నిర్మాణాలలో మౌలిక వసతులైన నీళ్ల లేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ట్యాంకర్ల ద్వారా నీళ్ల కొనుకుంటూ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఒక ట్యాంకరు రెండు వేల నుంచి మూడు వేలు డబ్బులు ఇచ్చి నీళ్ల కొనుక్కొని ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఇళ్ల నిర్మాణాల చేపట్టాలంటే ప్రతి పనికి నీరు చాలా అవసరం. నిర్మాణాలు చేపట్టకపోతే పట్టాలు రద్దు చేస్తామని అధికారులు బెదిరించడంతో చేసిదేమీ లేక ట్యాంకర్లతో నీళ్లు కొనుక్కు ంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రసాద్ స్కీమ్ పరిస్థితి ఏంటి.....?

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానం సింహగిరి వర్తకం సంఘంతో దేవాదాయ శాఖ ఏడీసీ రామచంద్రమోహన్, కార్య నిర్వాహణాధికారి ఎస్.శ్రీనివాస మూర్తి, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబులు గురువారం సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీమ్‌లో కొండపైన నూతన దుకాణ సముదాయం తదితర పనులు కారణంగా ప్రస్తుతం ఉన్న దుకాణ సముదాయం తొలగించాల్సి ఉంది. అందుకు ప్రత్యామ్నాయంగా కొద్ది రోజుల క్రితం కొండపైన వివిధ ప్రాంతాలలో తాత్కాలిక దుకాణాలు నిర్మించాలని వర్తక సంఘం వారు విన్నవించారు. అయితే ఆ సమస్య ఇంకా ఓ కొలిక్కి రాలేదు. దీనిపై ఏడీసీ కోదూరి రామచంద్రమోహన్ ప్రసాద్ స్కీమ్ పనులపై ఆరా తీశారు. ఎయిఅఅఎఎ పసాద్ స్కీమ్ పరిస్థితులను తెలుసుకోవాలని పంపారు. అసలు ప్రసాద్ స్కీమ్ పనులు ఇంకా ఎందుకు ప్రారంభం కాలేదని ఆయన ఆరా తీశారు. ప్రసాద్ స్కీమ్ గ్రౌండ్ పనులు ప్రారంభం కాకుంటే స్కీమ్ వెనక్కి వెళ్లే ఆకాశాలు ఉండవచ్చుననే గుస గుసలు అధికారులనుండి వినిపిస్తున్నాయి. శుక్రవారం పర్యాటక శాఖ సీఈ సింహాచలం విచ్చేసి పనులపై ఆరా తీయనున్నారు.

మాతృ మరణాల నియంత్రణకు కృషి చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: జిల్లాలో మాతృ మరణాలు నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గత ఏప్రిల్ నెల నుండి ఇంతవరకూ జరిగిన ఎనిమిది మాతృ మరణాలపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. మాతృ మరణాలు సంభవించకుండా ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖ, వైద్య సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది స్థానిక ప్రజా ప్రతినిధులు అందరూ కృషి చేయాలని సూచించారు. హై రిస్క్ గర్భిణీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జమాల్ బాషా, డిసిహెచ్ఎస్ డా. కృష్ణ రావు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.సూర్య లక్ష్మి, ప్రపంచ ఆరోగ్య సంస్థ రాష్ట్ర సర్వెలెన్స్ మెడికల్ అధికారి డా. జాన్ జ్యూడ్ ఝాషువ, డా. హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ రిజిస్ట్రార్‌ను కలిసిన కార్పొరేటర్ ముమ్మన

విశాలాంధ్ర - పెందుర్తి : ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.జేమ్స్ స్టీఫెన్‌ను గురువారం జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

పద్మనాభ స్వామి ఆలయ ఘాట్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు



విశాలాంధ్ర - పద్మనాభం: విశాఖ జిల్లాలో అత్యంత పుణ్యక్షేత్రాలలో ఒకటైన పద్మనాభం మండలంలో గల పద్మనాభం పంచాయతీలో కొలువైన శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయం కొండ పైకి ఘాట్ రోడ్డు నిర్మాణానికై నిధులు మంజూరు చేయాలని మాజీ మంత్రి భీమిలి నియోజకవర్గం శాసన సభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు సీఎం జగన్‌కు విన్నవించారు. ఆయన వెంటనే స్పందించి ఘాట్ రోడ్డు నిర్మాణంకై 5 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఘాట్ రోడ్డు నిర్మాణంకై టెండర్ పిలవడం జరిగిందని టెండర్ ప్రక్రియ పూర్తికాగానే పనులు మొదలు పెడతామని ఎమ్మెల్యే అవంతి అన్నారు.

అభివృద్ధి, శాంతి సాధనకు న్యాయం ముందుండాలి

విశాలాంధ్ర - మల్కాపురం: దేశంలో అభివృద్ధిని, శాంతిని సాధించడానికి ముందు న్యాయం ఉండాలని, మానవ హక్కులు ప్రజలందరికీ సమానంగా అందుబాటులో ఉండాలని సెయింట్ ఆన్స్ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో "సామాజిక న్యాయం"పై జరిగిన ప్రత్యేక సదస్సులో ఆమె ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. ఎవరికి ఇవ్వవలసింది వారికి ఇవ్వడమే న్యాయమని, ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. సమానుల్ని అసమానులుగా, అదేవిధంగా అసమానులను సమానంగా చూడకూడదని న్యాయ సిద్ధాంతం చెబుతోందని అన్నారు. మానవ హక్కులు, చట్టాలు, వనరులు ప్రజలందరికీ కుల, మత, వర్గ, వర్ణ విచక్షణ లేకుండా అందుబాటులోకి తేవాలని అన్నారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు వై.అనసూయా దేవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్య సేవలు

విశాలాంధ్ర - అరకు లోయ: మండలంలోని పెదలబుడు గ్రామ సచిలయం-3 పరిధిలోని రవ్వలగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రజల వద్దకే వైద్య సేవలు తీసుకొచ్చిందన్నారు. ఇటువంటి వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరకులోయ మండల ఎంపీపీ ఉషారాణి, మండల వైసీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ యాసిన్, వైద్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగూడ: మండలంలోని తూటంగి పంచాయతీ పరిధిలోనున్న గేదెలబంద గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ పరిధిలో ఉన్న పలు గ్రామాల గిరిజనులు వైద్య శిబిరానికి హాజరై పలు వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారిణి ప్రేమ, ఎంపీహెచ్ ఓ సౌరి, హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్, సంజీవ్, స్వామి, దామోదర్, పంచా యతీ కార్యదర్శి రాజ్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పిఎల్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కింజరాపు ఎర్రన్నాయుడు వర్ధంతి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: మాజీ కేంద్ర మంత్రి మాజీ పార్లమెంట్ సభ్యులు కింజరాపు ఎర్రన్నాయుడు 11వ వర్ధంతిని 75వ వార్డు టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి రమణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నమ్మి అప్పారావు, దొమ్మేటి పేరుమల్లు, పులి శ్రీరాం రెడ్డి, పెద్దదా సోము నాయుడు, ములకలపల్లి పెంటరావు, సిమూసిరి శ్రీను, దొమ్మేటి అప్పారావు, అందిబోయిన రమునాయుడు, ఉరుకిటి వెంకటరావు, గోకడ ముత్యాలు, ఉరికుటి అప్పారావు, టేకేటి అప్పారావు, మొల్లి అప్పల నాయుడు, మొల్లి సోము నాయుడు, పెదపూడి అప్పలస్వామి పాల్గొన్నారు.

సీపీఐ నేత బొడ్డు వెంకటరమణ మృతి

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలోని ఎ.ఎల్. పురం గ్రామంలో నివసిస్తున్న సీపీఐ మాజీ ఎంపీపీ కామ్రేడ్ బొడ్డు వెంకటరమణ అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈయన 14 సంవత్సరాల వయసు నుండే ఎ.ఐ.ఎస్.ఎఫ్, ఎ.ఐ.వై.ఎఫ్, సిపిఐ పార్టీలో పనిచేసి ప్రజల్లో మంచిపేరు తెచ్చుకొని, 2006 సంవత్సరంలో గొలుగొండ మండల ఎంపీపీగా పని చేశారు. విద్యార్థి, యువజన, ప్రజానాట్యమండలి రంగాల్లో పనిచేశారు. చింతపల్లి శాసనసభకు, భద్రాచలం పార్లమెంట్ స్థానిక సంస్థలకు జరిగిన అన్ని ఎన్నికలలో క్రియాశీలక పాత్రలు పోషించారు. వెంకటరమణ అంతిమయాత్రలో సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్య నారాయణ, అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, డి.హెచ్.పి.ఎస్ గౌరవ అధ్యక్షులు డిసిహెచ్ క్రాంతి కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురు బాబు, ఇరువాడ దేముడు, జి.సతీష్, మేకా సత్యనారాయణ, మండల కార్యదర్శి మేకా భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు: కోన లక్ష్మణ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్రంలో భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం ఏఐటీయూసీ పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగుర వేయడానికి నిర్మాణ రంగ కార్మికులందరూ సంసిద్ధం కావాలని ఆంధ్ర ప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ పిలుపు నిచ్చారు. అనకాపల్లి మండలం మూలపేట, మామిడి పాలెం గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. తండ్రిని మించిన తనయుడుగా ఉంటానని చెప్పిన జగన్మోహన్ రెడ్డి తండ్రి పెట్టిన పథకానికి తూట్లు పొడిచి రాష్ట్రంలో 50 లక్షల మంది కార్మికులు కడుపులు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996 దేశవ్యాప్తంగా అమలవుతున్నా రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి బోర్డును తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని తెలిపారు. జీవో నంబర్ 17 ద్వారా ప్రభుత్వం సంక్షేమ పథకాలకు, ఇతర ప్రయోజనాలకు దారి మళ్లించుకుంటున్న జగన్ ప్రభుత్వం కష్టజీవుల పక్షపాతినని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన రూ.1,200 కోట్ల సంక్షేమ బోర్డు నిధులను వెంటనే బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు చిన్న, పి.నర్సింగరావు, సిహెచ్.అప్పలరాజు, ఎం.సత్య నారాయణ, రమణ, చిన్ని సత్తిబాబు, భూపాలం మహాలక్ష్మి నాయుడు, కాశీ అప్పారావు, గులి విందాల రామునాయుడు పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి పెద్దపీట

మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర - కె.కోటపాడు: రాష్ట్రంలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ప్రజలు మరోసారి గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్య నారాయణ అన్నారు. గురువారం మాడుగుల నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభానికి ముందు కె.కోటపాడు శివాలయం కళ్యాణ మండపంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కుల, మత, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా పాలన సాగిస్తూ సంక్షేమ సారథిగా గుర్తింపు పొందారని అన్నారు. ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర మాట్లాడుతూ ఏ ప్రభుత్వంలోని లేని విధంగా జగన్ మంత్రివర్గంలో 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల నుంచి మంత్రులుగా తీసుకున్నారని, అంతేకాకుండా అనేక కార్పొరేట్ పదవుల్లో ఈ సామాజిక వర్గాలకు పదవులు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. విలేకరుల సమావేశంలో ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, అనకాపల్లి ఎంపీ సత్యవతి, చోడ వరం ఎమ్మెల్యే ధర్మశ్రీ, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజ్, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్, బొడ్డేటి ప్రసాద్, రెడ్డి జగన్మోహన్, ఈర్లే అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నాగులపల్లి సహకార సంఘం పనితీరు భేష్

విశాలాంధ్ర - మునగపాక: మండలంలోని నాగులపల్లి సహకార సంఘం పనితీరు భేష్‌గా ఉందని లక్నో బ్యాంకర్స్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ ఉపేంద్ర సింగ్ అన్నారు. మిజోరాం, హర్యానా, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల సహకార బ్యాంకుల చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు సుమారు 40 మంది ప్రతినిధులు తోటాడ గ్రామంలో బహుళార్థ సాధక సౌకర్యాల కల్పన నిమిత్తం సుమారు 35 లక్షల రూపాయలతో నిర్మించిన గొడౌన్‌ను సందర్శించారు. ఉపేంద్ర సింగ్ మాట్లాడుతూ రైతులు పండించు వ్యవసాయ దినుసులు నిల్వ చేయుట మార్కెటింగ్ సకల సదుపాయాలు ఈ సంఘం ద్వారా కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాగులపల్లి సొసైటీ అధ్యక్షులు మల్ల ఉమామహేశ్వర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పిడిసి రాజు, విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ పెంటకోట స్వామి నాయుడు, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ డివిఎస్ రామారావు, తోటాడ సర్పంచ్ దొడ్డి మంగ వేణి, కోటేశ్వరరావు, సంఘ ముఖ్య కార్యనిర్వహణాధికారి మల్ల స్వామి చంద్ర నాయుడు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై సీఎం సానుకూల స్పందన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు ముఖ్యమంత్రి జగన్‌కు వినతి పత్రం అందజేశారు. విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌ను గురువారం ఉదయం ఐటీ హిల్స్ హెలిప్యాడ్ వద్ద సొసైటీ గౌరవ అధ్యక్షులు కె.జి.రాఘవేందర్ రెడ్డి, అధ్యక్షులు బి.రవికాంత్‌లు కలిసి తమ సొసైటీ ద్వారా రిజిస్టర్ అయిన అక్రిడేటెడ్ జర్నలిస్టుల వివరాలను ఆయనకు అందజేశారు. ఈ ఏడాది అక్రిడేషన్ ఉన్న జర్నలిస్టుల వివరాలు, 2006 నుంచి 2022 వరకు వివిధ సంవత్సరాల్లో అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టుల వివరాల జాబితాను ఆయనకు అందజేశారు. సుమారు 18 ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి జగన్ సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించే విషయాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి ధనుంజయ రెడ్డికి సూచించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.మురళీ కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతల రహదారులు వాహనదారుల పాలిట గుదిబండ

విశాలాంధ్ర - చింతపల్లి: వైకాపా ప్రభుత్వంలో గుంతల రహదారులు వాహన దారులు, ప్రయాణీకుల పాలిట గుది బం డలుగా తయారయ్యాయని వాటిని కనీసం మరమ్మత్తులు చేయించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని తెదేపా అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగ భూషణం అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ చింతపల్లి - గూడెం కొత్త వీధి మీదుగా అంతర్ రాష్ట్రాలకు వెళ్లే ప్రధాన రహదారులు సైతం గుంతలమయమై వాహన దారులు, ప్రయాణికులు రాక పోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా గుంతలు పూడ్చి రహదారుల సంక్షేమానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

సీఎంను కలిసిన ఇల్లాపు

విశాలాంధ్ర - ఆనందపురం: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని భీమిలి నియోజకవర్గం యూత్ ప్రెసిడెంట్ ఇల్లాపు వెంకట్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో యువతకి కావలసిన ఉద్యోగ అవకాశాలు, ఉపాధి మొదలగు అంశాల గురించి ప్రస్తావించారు. దానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఇంతటి చక్కని అవకాశాన్ని కల్పించిన భీమిలి ఎమ్మెల్యే అవంతికి యూత్ ప్రెసిడెంట్ కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండలం గెమ్మెలి సచివాలయ పరిధిలో గొడు గురాయి గ్రామంలో నిలిపివేసిన రోడ్డు పనులను ప్రారంభించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మానపడాల్ డిమాండ్ చేశారు. ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుండి 49 లక్షలతో గ్రావెల్ రోడ్డు మంజూరైందని దీనికి సంబంధించి ఫారెస్ట్ అధికారులు అడ్డుపడుతున్నారని పనులు నిలిపివేసినట్టు తెలిపారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి రోడ్డు పనులు ప్రా రంభించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మానపడాల్, గిరిజన సంఘం మండల కార్యదర్శి వనుగు సన్యాసిదొర, పంచాయతీ నాయ కులు వంజరి పినంనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు అనంతగిరిలో స్పందన

విశాలాంధ్ర - అనంతగిరి: ఈనెల 3వ తేదీ శుక్రవారం అనంతగిరిలో జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్.శ్రీహర్షిత్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్ కుమార్ హాజరు కానున్నారని అనంతగిరి ఎంపీడీఓ కార్యాల యంలో నిర్వహించే స్పందనకు విధిగా అన్ని శాఖ అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. స్పందన కార్య క్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి జగన్‌కు ఘనస్వాగతం

విశాలాంధ్ర - గోపాలపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆయన వెంట రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు నగరానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని, నగర మేయరు గొలగాని హరి వెంకట కుమారి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర, జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున, పార్లమెంటు సభ్యులు బి.వి.సత్యవతి, జి.మాధవి, డీసీసీబీ ఛైర్మన్ కోలా గురువులు, సంయుక్త కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు.

యాజమాన్య కుట్రలను ఉద్యమాలతో తిప్పికొడదాం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌పైన, కార్మికుల పైన యాజమాన్య కుట్రలను ఉద్యమాలతో తిప్పికొడదామని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ పిలుపు నిచ్చారు. ఉక్కు కర్మాగారంలో స్టీల్ సీఐటీయూ, మిత్రపక్షాల ఆధ్వర్యంలో స్టీల్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని, స్టీల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయాలని ధర్నా నిర్వహించారు. అనంతరం ఈడీ కార్యా లయం వరకు పాదయాత్ర చేసి వినతి అందించారు. యాజమాన్యం కావాలనే ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షులు వైటి దాస్, మిత్రపక్షాల నాయకులు డివి రమణారెడ్డి, డి.సురేష్ బాబు, సిహెచ్ సన్యాసిరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కశింకోటను కరువు మండలంగా ప్రకటించాలి

విశాలాంధ్ర - కశింకోట: కశింకోటను కరువు మండలంగా ప్రకటించాలని రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి అన్నారు. మండలంలోని రైతుల పరిస్థితులను, పంట స్థితిగతులను వారు గురువారం పరిశీలించారు. సాగు చేసిన పంట చేతికి అందే పరిస్థితి లేదని ఆందోళన లో రైతులు కొట్టు మిట్టాడుతున్నారన్నారు. మండలంలో అన్ని గ్రామాల రైతుల పరిస్థితి దయనీయంగా తయారైందన్నారు. ఈ సంక్షోభ పరిస్థితిని అధికార యంత్రాంగం పర్యవేక్షించి, జిల్లా రైతులను కశింకోట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి మండలంలోని అన్ని గ్రామాల రైతులకు తక్షణ సాయం అందించి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

సమాచార హక్కు చట్టం అంటే లెక్కే లేదు

విశాలాంధ్ర - పరవాడ: సమాచార హక్కుచట్టం 2005 అంటే పరవాడ తహశీల్దార్ కార్యాలయం సిబ్బందికి లెక్క లేకుండా పోయింది. ఈ చట్టం కింద అందే దరఖాస్తులకు కనీసం స్పందించక పోతే పోనీ...కానీ బోర్డును మార్చే తీరిక లేకుండా పోయింది ఇక్కడి సిబ్బందికి. పరవాడ తహశీల్దార్ ఏ జిల్లాలో పనిచేస్తున్నారు, ఏ ఆర్డీవో కింద పనిచేస్తున్నారన్నది ఈ బోర్డు చూస్తే ఇట్టే అర్థం అయిపోతుంది. ఎప్పుడో బదిలీపై వెళ్లిన డెప్యూటీ తహశీల్దార్ కె. వరహాలను సమాచార అధికారిగా పేర్కొంటూ ఆయన సెల్‌ఫోన్ నెంబర్‌నే ఈ బోర్డులో ఉంచారు. అంతకు మించి విశాఖ ఆర్డీవో పెంచల కిషోర్ మొదటి అప్పీలు అధికారిగా పేర్కొంటూ ఆయన ఫోన్ నెంబర్‌ను బోర్డులో ఉంచారు. పెంచల కిషోర్ విశాఖ ఆర్డీవోగా బదిలీ అయ్యారు. అనకాపల్లి జిల్లాలోని పరవాడకు విశాఖ ఆర్డీవోను మొదటి అప్పీలేట్ అథార్టీగా ఇప్పటకీ ఈ కార్యలయంలో కొనసాగిస్తున్నారు. దీన్ని పరిశీలించి చర్యలు తీసుకొనే తీరిక ఇక్కడి తహశీల్దార్ పాపిశెట్టి కనకారావుకు లేకుండా పోయింది. సరే బోర్డు సంగతి ఇలా ఉంటే ఇక్కడి సమాచార దరఖాస్తుకు కనీసం స్పందన లేదు. సమాచార దరఖాస్తులపై స్పందించండి మహాప్రభో అంటూ అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి ఎంతగా మొరపెట్టినా ఇక్కడి తహశీల్దార్‌కు లెక్కలేకుండా పోయింది. దీంతో ఈ మండలానికి చెందిన దరఖాస్తులు ఇబ్బడి ముబ్బిడిగా రాష్ట్ర కమిషన్‌కు వెళ్తున్నాయి. పరవాడ తహశీల్దార్ కార్యాలయం పరిధిలో కొత్తగా నియమితుల్కైన తలయారీలు(విఆర్ఎ)ల వివరాలివ్వండి అంటే కనీసం స్పందించ లేదు. అలాగే పరవాడ సర్వేనెంబర్ 304లో గెడ్డకు సంబంధించి అనకాపల్లి కలెక్టర్‌కు పంపిన లేఖ వివరాలు అడిగితే తహశీల్దార్ స్పందించలేదు. దీంతో జిల్లా రెవెన్యూ అధికారి ఎవ్వరికి తప్పినా మాకు తప్పదు కదా అంటూ లేఖను పంపారు. ప్రతి శుక్రవారం సమాచార చట్టం దరఖాస్తులపై సమీక్ష నిర్వహించాలని కమిషన్ ఆదేశాలు సైతం ఇక్కడ బుట్టదాఖలవుతున్నాయి. కలెక్టర్ స్పందించకుంటే ప్రభుత్వానికి అప్రతిష్ఠ తప్పదు.

పాత రేట్లతో కొత్త భవనాల నిర్మాణాలు ఎలా?

- మండల పరిషత్ సమావేశంలో సభ్యులు ఆవేదన

విశాలాంధ్ర - పాయకరావుపేట: పాత రేట్లతో కొత్త భవనాలు నిర్మాణాలు చేయమంటే ఎలా అని మండల పరిషత్ సమావేశంలో పలువురు సభ్యులు అధికారులను ప్రశ్నించారు. ఎంపీపీ ఇసరపు పార్వతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ నిర్మాణాల్లో ఉపయోగించే సిమ్మెంటు, ఇనుము, ఇసుక ధరలు పెరిగిపోయాయని, అయితే అధికారులు పాత ధరలు ప్రకారమే బిల్లులు చేస్తున్నారని తెలిపారు. దీంతోపాటు జీఎస్టి కూడా కట్ చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే ధరల ప్రకారం ప్రభుత్వ నిర్మాణాలు చేపట్టాలంటే లాభాలు రాకపోయినా నష్టాలు మాత్రం తప్పని సరిగా వస్తున్నాయని తెలిపారు. దీని వల్లనే నిర్మాణాలు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాలేకపోతున్నారని, దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటు పడుతుందని తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం 20 ఏళ్ల క్రితం పేదలకు భూములు పంపిణీ చేసిందని, ఆ భూములు అమ్మకాలు జరిగి పోయాయని, భూములు కొనుగోలు చేసిన వారు కూడా పేదవారేనని, అయితే భూముల అమ్మకాలు, కొనుగోలు చేసిన వారి మధ్య వివాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఇరువురికి న్యాయం చేయాలని సర్పంచ్ వంకా వెంకటరమణ కోరారు. ఓటీఎస్ పథకం ద్వారా మండలంలో చాలా మంది ప్రజలు రూ.10వేలు చెల్లించారని వారికి నేటికి ధృవపత్రాలు పంపిణీ చేయలేదని సర్పంచ్ కోడా కోటేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ ద్వారా సభ్యులకు విడుదలైన గ్రాంటులు తెలియజేయాలని ఈదటం ఎంపిటిసి కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ టీసీ లంకా సూర్యనారాయణ, వైఎస్ ఎంపీపీ పల్లెల మణికంఠ స్వామి, ధనిశెట్టి మాధవి, ఎంపీడీఓ సాంబశివరావు, డిప్యూటి తహశీల్దార్ కె.నూకరాజు, పలు శాఖ అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

అనకాపల్లిని తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలి

విశాలాంధ్ర-రాంబిల్లి: మండలంలో పంచదార్ల గ్రామంలో గల పంట పొలా లను గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు పరిశీలించారు. అనంతరం అక్కడున్న రైతు జి.శంకర్రావుతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ రెండెకరాలలో ఎకరాకు 30వేల రూపాయలు పెట్టుబడి వ్యయంతో పంట వేశానని నీరు లేక ఎండిపోయిందని వాపోయారు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, రైతు సంఘం నాయకులు బి.రాము, ఎ.విఘ్నేశ్వరరావు, సిపిఎం నాయకులు రొంగలి రాము, కూండ్రపు సోమునాయుడు, రాంబిల్లి మండల నాయకులు జి.దేముడు నాయుడు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ ఆర్థికసాయం

విశాలాంధ్ర - చింతూరు: ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేద ముస్లిం యువతి వివాహానికి గాను గురువారం ఆసుపత్రి ఆవరణలో లక్ష రూపాయల చెక్కును అందజేశారు. సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు తదితరాలతో ఆడపిల్లల వివాహం ఒక సమస్యగా మారిందన్నారు. తమ సంస్థలో ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న సిబ్బందికి తన వంతు సాయంగా వారి సోదరి వివాహానికి ఆర్థికంగా సహాయం చేయడం అల్లా ఆదేశానుసారంగా జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జెకె సిటీ ఇంచార్జ్ సుభాని, యాసీన్ మస్జీద్ పేషీమాం, ఎజాజ్ అహ్మద్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు గోవాడ విద్యార్థులు

విశాలాంధ్ర - చోడవరం: మండలంలోని గోవాడ జెడ్.పి హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కె.రాము, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.ఉదయ్ భాస్కర్ గురువారం మీడియాకు తెలియజేశారు. యలమంచిలి మండలం కొత్తపేట హై స్కూల్ లో జరిగిన ఈ సెలెక్షన్స్‌లో అండర్ 17 విభాగంలో గోవాడ హై స్కూల్‌లో చదువుతున్న గంటా కుసుమ దీప్తి, 14 సం. విభాగంలో చిరికి వసంత ఎంపికయ్యారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ఉపాధ్యాయులు తెలిపారు.

జనవరి 4, 5, 6, 7 తేదీల్లో రాష్ట్ర స్థాయి కథా నాటిక పోటీలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జనవరి 4, 5, 6, 7 తేదీల్లో రాష్ట్ర స్థాయి కథా నాటిక పోటీలు విశాఖలో జరగనున్నాయని మాజీ మంత్రి, రచయిత, సాహిత్య ప్రయోక్త దాడి వీరభద్రరావు వెల్లడించారు. అజో -విభో - కందాళం ఫౌండేషన్, రైటర్స్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించే 31వ వార్షిక సభల విశిష్ట పురస్కారాల వివరాలను గురువారం పౌర గ్రంథాలయంలో మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ ఉత్సవాలలో ఉదయం సాహిత్య గోష్ఠి, సాయంత్రం నాటకాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ జీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని, నాటకాలను ప్రేక్షకులకు చూపించడం తమ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో అజో - విభో - కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపకులు అప్పాజోస్యుల సత్యనారాయణ, రైటర్స్ అకాడమీ అధినేత వీవీ రమణమూర్తి, బాదంగిరి సాయి, తదితరులు పాల్గొన్నారు.

మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఈనెల 11వ తేదీన హైదరాబాదులో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఎంఆర్‌పిఎస్ ఇన్‌ఛార్జి గంపల చినరాజు కోరారు. ఎంఆర్‌పిఎస్ ముఖ్య నాయకులు సమావేశం పాయకరావుపేటలో జరిగింది. ఈసమావేశంలో గంపల చినరాజు మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన పాయకరావుపేటలో నియోజకవర్గ స్థాయి ఎంఆర్‌పిఎస్ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఎస్‌పి అనకాపల్లి నియోజకవర్గ కన్వీనర్ కొల్లి చిన అప్పారావు, ఎంఆర్‌పిఎస్ అనకాపల్లి జిల్లా యువసేన అధ్యక్షుడు యలకా మల్లిబాబు, మండల అధ్యక్షుడు కుందూరు కుమార్, గంపల రాంబాబు, కండెల్లి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు ఎంపికలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ - గురజాడ, విజయనగరం వారు విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో కబడ్డీ మేన్స్ ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ అండ్ సెలెక్షన్ - ట్రయల్స్‌ను నిర్వహించారు. ఈ సెలక్షన్స్ 3వ తేదీ కూడా జరగనున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం మరియు విశాఖపట్నం జిల్లాల నుంచి మొత్తం 15 టీమ్స్, 200 మంది క్రీడకారులు సెలక్షన్ ట్రైల్స్‌కు వారి పేర్లను నమోదు జేసుకున్నారని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజీ కళాశాల ప్రిన్సిపాల్ డా. జ్యోతుల సుధాకర్ తెలియజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ డా. కె.నాగరాజు, గొన్న ఇంజనీరింగ్ కాలేజీ నుండి వి.ప్రభుకరుణ, విజ్ఞాన్ కళాశాల నుండి విజ్ఞాన్ సి.ఈ.ఓ. ఎన్.శ్రీకాంత్, రెక్టర్ డా. వి. మధుసూదనరావు, కళాశాల ప్రిన్సిపాల్ డా. జ్యోతుల సుధాకర్, వైస్-ప్రిన్సిపాల్ డా. పి.యస్.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కశింకోట: సామాజిక సాధికార బస్సు యాత్రను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని కసింకోట మండల ఎంపీపీ కలగా లక్ష్మీ గున్నయ్య నాయుడు పేర్కొన్నారు. ఈనెల 9న జరగబోవు సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయాలన్న సంకల్పంతో కసింకోట వైసిపి మండల కార్యవర్గ సమావేశం గురువారం తాళ్లపాలెంలో నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కులమతాలకతీతంగా అర్హులైన అన్ని వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయడంతో పాటు అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యతనిచ్చి వారి వారి అభ్యున్నతికి దోహదపడు తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ దంతులూరి శ్రీధర్ రాజ్, ఉగ్గిన పాలెం సర్పంచ్ కలగ గున్నయ్య నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మలసాల కిషోర్, పెంటకోట జ్యోతి శ్రీనివాస రావు, నమ్మి మీనా గణేష్, ఇందల ముసలి నాయుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరకు సోము నాయుడు, అద్దంకి సతీష్, చిన్ని రాజీవ్ పాల్గొన్నారు.

అక్షయ పాత్ర ఫౌండేషన్‌లో జాగృతి యాత్ర

విశాలాంధ్ర - ఆనందపురం: మండలం గంబీరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాగృతి యాత్ర కార్యక్రమం గురువారం చేపట్టారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ (ఆంధ్ర , తెలంగాణ) ప్రెసిడెంట్ సత్య గౌర చంద్ర దాస, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జాగృతి యాత్ర ఫౌండేషన్ ప్రెసిడెంట్ అశుతోష్ కుమార్, బొంబాయి జాగృతి యాత్ర కోఆర్డినేటర్ అర్చన పాల్గొని మాట్లాడారు. జాగృతి సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాల నుండి జాగృతి యాత్రను నిర్వహిస్తున్నామని అన్నారు. యువ పారిశ్రామిక వేత్తలను తయారుచేయడం ఈ యాత్ర ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలోఅక్షయపాత్ర ఫౌండేషన్ అధ్యక్షులు సత్యగౌరచంద్ర దాస, జన జాగృతి యాత్ర విశాఖపట్నం అధ్యక్షులు నిష్కించిన భక్తి దాస, రామ మోహన్, పిఆర్వో హారిక తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్లు ఏర్పాటుకు సీఎం హామీ

విశాలాంధ్ర - ఆనందపురం: గ్రామాలలో బీటీ రోడ్లు ఏర్పాటుకు రాష్ట్రవ్యాప్తంగా 500 కోట్లు మంజూరు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చినట్టు విశాఖ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు గండ్రెడ్డీ శ్రీనువాసరావు తెలిపారు. సీఎం జగన్‌కు విశాఖ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు ఆనందపురం మండలం, గండిగుండం సర్పంచ్ గండ్రెడ్డి శ్రీనివాసరావు భీమిలి శాసన సభ్యులు చొరవతో పలు సమస్యలపై వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 500 కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సర్పంచుల పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వీటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో భీమిలి శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గండిగుండం సర్పంచ్ గండ్రెడ్డి శ్రీనువాసరావు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కందిరీగల దాడిలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - హుకుంపేట: పెద్ద కందిరీగలు దాడి చేయటంతో గిరి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలం లో చోటుచేసుకుంది. భీమవరం పంచాయతీ మద్దిపుట్టు గ్రామానికి చెందిన పాంగి సత్తిబాబు 31వ తేదిన తేనె సేకరించేందుకు అడవికి వెళ్లాడు. అయితే అక్కడ పెద్ద. కందిరీగలు అధిక సంఖ్యలో దాడి చేసాయని కుటుంబ సభ్యులు తెలిపారు. తనతోపాటు వెళ్లిన మరి కొందరు హుటాహుటిన ఉప్ప పీహెచ్‌సీకి తరలించారని అక్కడ వైద్య సేవలు పొందుతు బుధవారం రాత్రి మృతి చెందాడని ఆయన భార్య కొండమ్మ తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి భార్య నలుగురు పిల్లలు ఉన్నారని కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోయామని వారు కన్నీరు మున్నీరుగా విలపించారు.

ప్రముఖ రైతు వెల్లంకి హర్నాథ్‌బాబు మృతి

విశాలాంధ్ర - ఎటపాక : తోటపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ రైతు వెల్లంకి హర్నాథ్ బాబు (76) ఆకస్మికంగా గుండె పోటుతో మృతి చెందారు. వెల్లంకి హర్నాథ్ బాబు మృతి పట్ల గ్రామస్తులు, శ్రేయోభిలాషులు కన్నీటి పర్యంతం అయ్యారు. సుదూర ప్రాంతాల నుండి పలువురు వచ్చి ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి తమ సంతాపాన్ని వ్యక్తపరిచారు.

టీడీపీ కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని 69వ బూత్‌లో తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షులు పెదిరెడ్డి శ్రీను, పల్లా విలియం కేరి, జూరెడ్డి ప్రసాద్, మలిపెద్ది వెంకట రమణ, వేములపూడి అప్పారావు, గుల్లా నాగరాజు, చిరుకూరి పేర్రాజు, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, గంపల చిన రాజు, ముంజులూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐ.టి హిల్ నెం.3 హెలిప్యాడ్ వద్ద సీఎంకు ఘన స్వాగతం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: 25వ అంతర్జాతీయ కాంగ్రెస్, ఐసీఐడీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ 74వ అంతర్జాతీయ సమావేశాల ప్రారంభోత్సవం సందర్భంగా విశాఖ చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖ విమానాశ్రయం నుండి ప్రత్యేక హెలికాప్టర్‌లో మధురవాడ ఐ.టి హిల్ నెం.3 వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ఈ ఉదయం గం.9.15 ని.లకు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పోలీస్ కమీషనర్ ఏ రవి శంకర్ స్వాగతం పలికారు. అనంతరం అక్కడ వేచి ఉన్న టి.టి.డి మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, శాసనసభ్యులు అదీప్ రాజ్, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, పి ఉమాశంకర్, ఎమ్మెల్సీలు పండుల రవీంద్రబాబు, వంశీకృష్ణ యాదవ్, వరుదు కళ్యాణి, కుంభ రవిబాబు, ఉత్తర నియోజక వర్గ ఇంచార్జి కెకె రాజు, విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, నగరాల కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పిల్లా సుజాత, ఐసిడిఎస్ ప్రాంతీయ ఛైర్ పర్సన్ మంతెన మాధవి, మాజీ ఎంపి కిల్లి కృపారాణి, జి.వేంకటేశ్వర రావు, తదితరులు ముఖ్యమంత్రిని కలిశారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, జిల్లా ఇంఛార్జి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, జిల్లా కలెక్టర్ డా. ఏ మల్లికార్జున తదితరులు ఉన్నారు. అనంతరం ముఖ్యమంత్రి కార్యక్రమ వేదిక హెూటల్ రాడిసన్ బ్లూకు రోడ్డు మార్గాన బయలు దేరి వెళ్లారు. ఐసిఐడి సమావేశం అనంతరం తిరిగి ముఖ్యమంత్రి గం .11.55 ని లకు ఐ.టి హిల్ నెం.3 వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. వారికి ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఐ టి శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణ దాసు, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పాడేరు శాసన సభ్యురాలు భాగ్యలక్ష్మి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ తదితరులు వీడ్కోలు పలికారు.

రైతు సంఘం నాయకుల అరెస్టు

విశాలాంధ్ర - కె కోటపాడు: తీవ్ర వర్షా బావ పరిస్థితుల వలన ఎండిపోయిన వరి పంటలను పరిశీలిం చుటకు వెళ్లిన ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబును, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగలి ముత్యాల నాయుడును, ప్రజా సంఘాల కన్వీనర్ ఎర్ర దేముడులను గురువారం మండలంలోని ఆనందపురం గ్రామంలో పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిని కొత్తవలస పెందుర్తి మీదుగా సబ్బవరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు.

అలాగే టీడీపీ నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు ఆధ్వర్యంలో సామాజిక సాధికారిక యాత్ర మండల కేంద్రంలో ప్రారంభం అవుతున్న దృష్ట్యా ఆ యాత్రకు ఆటంకం కలిగిస్తారని భావించిన పోలీసులు ముందస్తుగా వీరిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

హైవే పేరిట గిరిజనుల కళ్లల్లో దుమ్ము కొడుతున్నారు

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: హైవే రోడ్ల నిర్మాణం పేరిట గిరిజనుల కళ్ళల్లో దుమ్ముకొట్టి గిరిజనుల సంపదను బడాబాబులకు, కార్పొరేట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచిపెడుతున్నాయని సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాసరావు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై చేపట్టిన ప్రజారక్షణ బేరి బస్సు యాత్ర గురువారం స్థానిక మండలంలో చేరింది. 516 జాతీయ హైవే రోడ్డు నిర్మాణానికి అనుమతిస్తున్న అటవీ శాఖ అధికారులు గిరిజన గ్రామాల్లో రోడ్లు వేయడానికి ఎందుకు అవకాశం ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపి, జనసేన పార్టీలన్నీ బిజెపికి ఊడిగం చేస్తున్నాయని ఆయన చెప్పారు.

ప్రత్యేక హెూదా ఇవ్వని బిజెపి పార్టీకి రాష్ట్రంలో అడుగు పెట్టే హక్కు లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్య నారాయణ, దడాల సుబ్బారావు, అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పలనరస, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సురేంద్ర, సిపిఎం సర్పంచ్ పి.సునీత, మండల సీనియర్ నాయకులు పి.సురేష్ కుమార్, పి.సత్య నారాయణ దుంబు, నాయకులు, కార్యకర్తలు గిరిజనులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'సముద్ర ఆర్టిస్ట్' కళాఖండం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: వినూత్నమైన, స్థిరమైన మౌలిక సదుపాయాల పరిష్కారాలలో ప్రత్యేకత కలిగిన బహుళజాతి వ్యాపార సంస్థ, విశ్వసముద్ర గ్రూప్ వైజాగ్‌లో "ది సముద్ర ఆర్టిస్ట్ ఎగ్జిబిషన్"ను భారతీయ పెర్ఫార్మింగ్ విజువల్ ఆర్ట్స్‌ను ప్రోత్సహించటంలో అత్యంత ప్రసిద్ధి చెందిన భారతీయ సంస్థలలో ఒకటైన సెహర్ సహకారంతో ఆవిష్కరించింది. ఈ కళాఖండాన్ని 25వ ఐ సి ఐ డి ఇంటర్నేషనల్ కాంగ్రెస్, 74వ ఐఇసి సమావేశంలో గురువారం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో ప్రదర్శించారు. సముద్ర ఆర్టిస్ట్ ఎగ్జిబిషన్ అనేది 2023 అక్టోబర్ 28 నుండి నవంబర్ 2 మధ్య వారం రోజుల పాటు నిర్వహించిన వినూత్నమైన కళాకారుల శిబిరం యొక్క ఫలితం అని, వైజాగ్ నుండి ఐదుగురు అసాధారణమైన స్థానిక కళాకారులతో సహా భారతదేశం అంతటా 20 మంది ప్రసిద్ధ కళాకారులు, వైజాగ్ తీరానికి ప్రత్యేకమైన 'నీరు' నేపథ్యం చుట్టూ ఈ కళాకృతులను రూపొందించారని ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు.

గూడూరు అంగన్వాడి-1 ఆయా నియామకంపై సమగ్ర విచారణ జరపాలి

విశాలాంధ్ర - చింతూరు: చింతూరు మండలం గూడూరు అంగన్వాడి ఆయా-1 నియామకంపై అక్రమాలు జరిగాయని సమగ్ర విచారణ జరిపించి అర్హత పరీక్షల్లో మెరిట్ ఆధారంగా నియమకం చేపట్టాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సిసం సురేష్, ఎర్రం శెట్టి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. చింతూరు సిపిఎం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గూడూరు అంగన్వాడి ఆయా-1 నియమకంలో అర్హతలు ఉన్న వారికి కాకుండా రాజకీయ పలుకుబడి, ఒత్తిడి మేరకు నియామకం జరిగిందన్నారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు. సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పోడియం లక్ష్మణ్, మొట్టం రాజయ్య, గూడూరు గ్రామస్తులు సోడా వినీత, ధూళి లక్ష్మయ్య, మడక నాగేశ్వరరావు, తెల్లం, జయ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధి ఎక్కడ....?

జనసేన వినూత్న నిరసన

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి, రోగులకు సేవల కొరతపై, ఆసుపత్రి అభివృద్ధి కోసం నిధుల విడుదలపై స్థానిక శాసనసభ్యులు, మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ డాక్టర్ సత్యవతి ఎప్పటికప్పుడు మాయమాటలు చెబుతూ అబద్ధపు హామీలు ఇస్తూ ప్రజలని మాయ చేస్తున్నారని జనసేన పార్టీ నాయకులు ఎద్దేవా చేశారు. అందుకు నిరసనగా ఎన్టీఆర్ ఏరియా ఆసుపత్రిలో వినూత్న రీతిలో చెవిలో పువ్వు అనే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు రాందాస్ గోవింద్, తాడి రామకృష్ణ దూలం గోపి, మళ్ల శ్రీనులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాల నుండి నిధులు వస్తున్నాయని, వైద్య పరీక్షల యంత్రాలు వస్తున్నాయని, సిబ్బంది కొరత తీరుతుందని మాయమాటలు చెప్పడం తప్ప అభివృద్ధి ఎక్కడా లేదన్నారు. ప్రైవేట్ అంబులెన్సులు ద్వారా ప్రజల నుండి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఇది పేరుకే జిల్లా ఆసుపత్రి రోగులకు సేవలు అందించడంలో మాత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కన్నా అధ్వాన్నమన్నారు. ఆసుపత్రి వైఫల్యంపై జనసేన పార్టీ నాయకులు పాటల రూపంలో కూడా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో అప్పికొండ గణేష్, గంగుపాం జగదీశ్, బర్నికాన రాము, సీత, వంశీ లక్ష్మణ్, ప్రసాద్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల జిల్లా సంఘం ఎన్నిక

విశాలాంధ్ర - హుకుంపేట: అల్లూరి సీతారామరాజు జిల్లా వినియోగదా రుల సంఘ ఎన్నికలు స్థానిక సంఘ కార్యక్రమంలో గురువారం నిర్వహిం చారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు బైరా గిమూర్తి అధ్యక్షతన ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. అల్లురి జిల్లా వినియోగదారుల అధ్యక్షురా లుగా పరమేశ్వరి, ఉపాధ్యక్షుడిగా రఘునాథ్, కార్యదర్శిగా సంగీత, శివప్రసాద్, రామస్వామి, కోశాధికా రిగా ప్రసాద్ లు ఎన్నికోవటం జరిగిం దని పాడేరు అరకు నియోజకవర్గాల డివిజన్ సెక్రటరీలుగా కిముదు హరి, సంతోష్, సత్యనారాయణ, ఎస్ సంతోష్ రంపచోడవరం డివిజ న్ సెక్రటరీలుగా ఆర్. నాగేష్, పీవీ భాస్కరెడ్డి, నాగమణిలు ఎన్నుకోవటం జరిగిందని ఆయన తెలిపా రు. అనంతరం ఎన్నికైన సభ్యులతో ప్రజల సమస్యలు నాసి రకం, కల్తీ వస్తువుల విక్రయాలపై దృష్టిపెట్టి ప్రజలను కాపాడేందుకు నిత్యం కృషి చేస్తామని వారు ప్రమాణ స్వీకారం నిర్వహించారు.

పదోన్నతిపై ఎంపీడీవో బదిలీ

విశాలాంధ్ర - మాకవరపాలెం: ఎంపీడీవో అరుణశ్రీ పదోన్నతిపై బదిలీ అయ్యారు. అయితే ఆమెకు ప్రభుత్వం డిఎల్‌డిఓగా పదోన్నతి కల్పించి విజయనగరం జిల్లాకు బదిలీ చేసింది. మండలంలో పలు గ్రామాల అభివృద్ధికి ఆమె చేసిన కృషికి మూడుసార్లు ఉత్తమ అధికారిగా అవార్డులు అందుకున్నారు.

కుమ్మరాపల్లిలో పొలంబడి

విశాలాంధ్ర - రాంబిల్లి: మండలంలో గల కుమ్మరాపల్లి గ్రామంలో గురువారం మండల వ్యవసాయాధికారి జి.సుమంత వరి పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సమగ్ర సస్య రక్షణ, జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా వరి పంటను ఆశించే చీడ పీడలు నివారించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లవిల్లి శ్రీనివాసరావు, జనపరెడ్డి చిన్న, చొచ్చు పట్ల సూర్య ప్రకాశరావు, తేటకల సత్యనారాయణ పాల్గొన్నారు.

యోగా గురువు పుల్లేటి సతీష్‌కి ఘన సత్కారం

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం పతంజలి శిక్షణ కేంద్రం యోగ గురువు పుల్లేటి సతీష్‌ను విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ యోగ విలేజ్‌లో జరిగిన యోగ అవగాహన కార్యక్రమానికి ఆహ్వానించి, ఆంధ్ర యూనివర్సిటీ యోగ విభాగం డైరెక్టర్ భాను కుమార్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ జిల్లా హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత విసి డాక్టర్ పి.శ్యాంప్రసాద్, యోగానంద స్వామీజీ విశాఖపట్నం జిల్లా యోగా సంఘం అధ్యక్షులు యోగ రాజు, కార్యదర్శి సిహెచ్ వెంకటరమేష్ యోగ టీచర్స్ పాల్గొన్నారు.

టెస్టింగ్ స్టాండర్డ్‌లను ఎలివేట్ చేస్తున్న కోన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశంలో కొత్త ఎలివేటర్ టెస్టింగ్ టవర్, ల్యాబ్‌లతో టెస్టింగ్ స్టాండర్డ్‌లను ఎలివేట్ చేస్తున్నది కోన్ అని కోన్ కార్పొరేషన్ ప్రెసిడెంట్, సీఈవో హెన్రిక్ ఎర్న్‌రూత్ తెలిపారు. పరిశ్రమలో ప్రముఖమైన హై-స్పీడ్ టెస్టింగ్ సౌకర్యాలు కల్పించనున్నామని తెలిపారు. కోన్ ఎలివేటర్స్ ఇండియా, కోన్ కార్పొరేషన్ పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ ఇదన్నారు. టవర్, ల్యాబ్‌లతో సహా అత్యాధునిక రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఎలివేటర్ టెస్ట్ సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మాన్యావర్ బ్రాండ్ అంబాసిడర్‌గా రామ్ చరణ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశంలో పురుషుల ఫ్యాషన్ సెలబ్రేషన్ అగ్రగామి బ్రాండ్ మాన్యావర్ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌ను ప్రకటించింది. ఇది పెళ్లిళ్ల పండుగల సీజన్‌లో తమ ఉత్పత్తులను మరింత మందికి చేరవేసేందుకు తయార్ హెూ కరియే అనే కొత్త క్యాంపెయిన్‌ను మాన్యావర్ మొదలుపెట్టింది. దేశం యొక్క సంస్కృతి సంప్రదాయలను ప్రతిబింబించేలా రామ్ చరణ్ ఉంటారని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు.

నీటి కష్టాలు తీర్చిన కార్పొరేటర్ హేమలత

విశాలాంధ్ర - మధురవాడ: జీవీఎంసీ ఐదో వార్డ్ పరిధిలో పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత త్రాగునీటి చేతిపంపు బోర్లును గురువారం ప్రారంభించారు. వైఎస్సార్ కాలనీ, పి.పి 1 కాలనీలలో చివర ఉన్న బ్లాక్ లలో ఉన్న నివాసితులుకు నీరు సరిగా చేరుకోవడం లేదని గతంలో గ్రామస్తులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లగా సమస్య పరిష్కరించి బోరును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, టిడిపి పార్లమెంటరీ ఉపాధ్యక్షులు వాండ్రాసి అప్పలరాజు, నమ్మి శ్రీను, ఈగల రవికుమార్, జోగేశ్వర పాత్రో, నూకరాజు, ఓలేటి శ్రావణ్, మొకర రవికుమార్, కొల్లా వెంకటేష్, అప్పన్న, సత్యనారాయణ, పెంటరావు, రామకృష్ణ, ప్రవీణ్ కుమార్, ఆలీ పాల్గొన్నారు.

నాని, ఆర్జీవీ, సంయుక్త మీనన్‌లతో జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ పార్ట్-2

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తెలుగు ప్రేక్షకులకు అంతులేని వినోదాన్ని అందించేందుకు ఎల్లవేళలా కృషిచేసే ఛానల్ జీ తెలుగు. నటీనటుల ప్రతిభను ప్రోత్సహించేందుకు 2023 సంవత్సరానికి గానూ ఇటీవలే టాలీవుడ్ ప్రముఖ తారలు, బుల్లితెర నటీనటుల మధ్య అంగరంగ వైభవంగా జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ ఉత్సవాన్ని నిర్వహించిందని ఆ ఛానెల్ ప్రతినిధి చెప్పారు. ఈ మెగా ఈవెంట్ పార్ట్-2ను ఈ ఆదివారం ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సిద్ధమైందన్నారు. ఈ కార్యక్రమానికి ఎనర్జిటిక్ యాంకర్స్ అయిన ప్రదీప్ మాచిరాజు-రష్మీ గౌతమ్ వ్యాఖ్యాతలుగా వ్యవహరిం చారన్నారు. ఈ నెల 5 ఆదివారం సాయంత్రం 6 గంటలకు జీ తెలుగు లో ప్రసారం అవుతుందని చెప్పారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

అందరికి సంక్షేమం...అదే వైసిపి ప్రభుత్వ లక్ష్యం

ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

విశాలాంధ్ర - వి.మాడుగుల: అర్హులందరికి సంక్షేమం అదే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. మాడుగులలో గురువారం సామాజిక సాధికార యాత్ర జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఉపముఖ్య మంత్రి మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా సంక్షేమ కార్యక్రమాలు సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. మూడు వంతుల్లో రెండు వంతులు బడుగు బలహీన వర్గాలు స్థానం కల్పించారన్నారు. కీలకమైన పదవులు బడుగు బలహీనర్గాలకు కట్టబెట్టారని కొనియాడారు. నాడు నేడు ద్వారా విద్యా వైద్య రంగంలో విప్లాత్మకమైన మార్పులు తెచ్చారని, కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలను మార్చారన్నారు.

సీఎం జగన్ 17 కొత్త మెడికల్ కళాశాలలు నిర్మిస్తున్నారని చెప్పారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రజలు కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశ పెట్టారన్నారు. రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ సామాజిక న్యాయానికి ముత్యాల నాయుడే ఒక ఉదాహరణ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యేలు ఉమాశంకర్‌గణేష్, ఆదిప్‌రాజు, గొల్ల బాబురావు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, జెడ్పీ చైర్మన్ సుభద్ర, పలువురు ప్రజ ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్టీఎస్ రోడ్డు భూనిర్వాసితులకు త్వరలోనే పరిష్కారం

- జిల్లా కలెక్టరు డా ఏ మల్లిఖార్జున

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సింహాచలం-అడవివరం బి.ఆర్.టి.యస్ రోడ్డు భూనిర్వాసితులకు పరిష్కారం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డా ఏ మల్లికార్జున పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మలతో కలిసి సింహాచలం - అడవివరం భూ నిర్వా సిత సమస్యపై వి.ఎం.ఆర్.డి.ఏ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా ఏ మల్లికార్జున మాట్లాడుతూ సింహాచలం - అడవి వరం భూ నిర్వాసితులకు సంబంధించి కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. భూ నిర్వాసితులకు ఇండ్ల నిర్మాణం, టి.డి.అర్‌లు అందించడంలో సత్వర న్యాయం అందిస్తామని అన్నారు. టి.డి.అర్ సమస్య పరిష్కారంలో చొరవ చూపించిన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గారికి కృతజ్ఞతలు తెలిపారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ బి.ఆర్.టి.యస్ రోడ్డు నిర్మాణంకై స్వచ్ఛందంగా తమ స్థలములు ఇచ్చిన వారిలో 60 శాతం పైబడి ఇళ్ళు, అలాగే ఇంటి స్థలం కోల్పోయిన వారికి ప్రభుత్వం తరుపున ప్రత్యామ్నాయ మార్గంలో ఇళ్ళు నిర్మాణం చేపట్టి అందివ్వాలని, అలాగే గతంలో అడవివరం బి.ఆర్. టి.యస్ రోడ్డు నిర్మాణంకై స్థలం ఇచ్చిన వారికి అందవలసిన టి.డి.ఆర్‌లు పెండింగ్ ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ అవి అందించడంలో టెక్నికల్ సమస్య వలన అనుకున్న సమయానికి అందించడం జరుగలేదని అన్నారు.

త్వరలో టి.డి.ఆర్ అందించడం జరుగుతుంది అని, 1:4 టి.డి.ఆర్ గతంలో ఇళ్ళు స్థలం కోల్పోయిన వారికి దేవస్థానం భూ సమస్త ఉందని టి.డి.ఆర్ ఇవ్వలేదని, ఈ విషయాన్ని స్థానిక యం యల్ఏ గా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి దృష్టిలో పెట్టడం జరిగిందని తెలిపారు . దానికి ఆయన సుముఖత తెలపడం జరిగిందని పేర్కొన్నారు. ఈ టీ.డి.ఆర్ అందించి తరువాత బి.ఆర్ .టి.యస్ రోడ్డు నిర్మాణం చేపడతామని, ఈ విషయంలో కలెక్టర్ ,జీవియంసి కమీషనర్ అన్ని విధాలా సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వి.ఎం.ఆర్.డి.ఏ సిబ్బంది, బి.ఆర్.టి.యస్ బాధితులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్బంధించారంటూ గిరిజన మహిళ ఆరోపణ

విశాలాంధ్ర - చింతపల్లి : మండలంలోని లబ్బంగి గ్రామం లోని మైనా రిసార్ట్స్ లో అందురాలైన తన బిడ్డతో సహా తనను నిర్బంధించారని గిరిజన మహిళ పత్రికా ఆరోపించింది. బాధిత మహిళ కాంగు శుభలక్ష్మి (చిన్ని) ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కేదారి వెంకటస్వామికి రూ. 15 లక్షలు అప్పుగా ఇచ్చి రెండు లక్షల తిరిగి పొందగా 13 లక్షలు చెల్లించ వలసి తన ఆధీనంలో ఉన్న రిసార్ట్స్ ను వెంకటస్వామి తనకు రాసి ఇచ్చాడన్నారు. , ప్రస్తుతం తాను రిసార్ట్స్ వద్దే అందురాలైన తన బిడ్డతో నివాసముంటున్నానని, ఇంతలో బుధవారం సాయంత్రం చింతపల్లి తహసిల్దార్ కార్యాలయం సిబ్బంది తనకు ముందుగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా, ఈ రిసార్ట్స్ వివాదాల్లో ఉందని, దీనిని సీజ్ చేస్తున్నామని వెంటనే కాళీ చేయాలని ఆదేశించారని, తాము లోపల ఉండగానే బయట గేటును తాళ్లతో కట్టి తమను నిర్బంధించారని ఆమె ఆరోపించారు. ఈ విషయమై రైతు కేదారి

వెంకట స్వామిని వివరణ కోరగా తాను ఇదివరకు లీజుకి ఇచ్చిన వారి గడువు ముగియడంతో శుభలక్ష్మి వద్ద అప్పుగా తీసుకున్న నగదు నిమిత్తమై ఆ రిసార్ట్స్ ను ఆమెకు అప్పజెప్పానన్నారు. రెవెన్యూ సిబ్బందిని వివరణ కోరగా ఇది కోర్టు పరిధిలో ఉందని దీనిపై ఎటువంటి సమాచారం ఇవ్వలేమని తెలిపారు.

అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలి

టీడీపీ జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్న వైసీపీ ప్రభుత్వం మాత్రం కరువు మండలాలను ప్రకటించడంలో అనకాపల్లి జిల్లాను పూర్తిగా విస్మరించిందని, వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోతున్న రైతుల గోడు ప్రభుత్వానికి పట్టించుకోకుండా, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి విహారయాత్ర చేస్తున్నట్లుగా తాడేపల్లి నుండి విశాఖ పట్నం విశాఖపట్నం నుండి తాడేపల్లి తిరుగుతున్నారే తప్ప రైతుల పక్షపాతి ప్రభుత్వం అని చెప్పుకుని జిల్లా మంత్రులు గుడివాడ అమర్నాథ్ బూడి ముత్యాల నాయుడు రైతుల పరిస్థితులను ప్రభుత్వానికి తెలియ జేయడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు వైసీపీ ప్రభుత్వంపై ఘాటుగా విమర్శలు చేశారు. వర్షాభావ పరిస్థితులు అనకాపల్లి జిల్లాలో ఉన్నదని దీని మూలంగా పంటలు దిగుబడి తగ్గుతాయని వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలో పంపిన గాని వ్యవసాయ మంత్రి గాని ప్రభుత్వ అధికారులు గానీ పట్టించుకునే నాథుడే లేదని నాగ జగదీష్ మండిపడ్డారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు, పంట నమోద, ఎండుతున్న పంటల పరిస్థితిని, ప్రభుత్వం ఏమాత్రం పరిగణనలోకి తీసుకున్న సరే జిల్లాను కరువు ప్రకటించవలసిన అనివార్య పరిస్థితి కానీ ప్రభుత్వం ఇవేవీ ప్రయత్నించుకున్నట్లు కనబడటం లేదని అన్నదాతల ఆవేదన వ్యక్త పరుస్తున్నారని తెలియజేశారు. ప్రభుత్వం ప్రకటించిన మండలాల్లో అనకాపల్లి జిల్లాను విస్మరించడం పట్ల తెలుగుదేశం పార్టీ తీవ్రంగా అసంతృప్తి వ్యక్తపరుస్తున్నామని, వాస్తవానికి జిల్లాలో జూన్ 1 నుండి అక్టోబర్ 31 వరకు 895.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 634.4 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదు అయిందని సగటు వర్షపాతం లో 29% లోటు ఉందని వీటిని పరిగణన లోకి తీసుకోకుండా రైతులకు వైసీపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని, ఒకపక్క చెరుకు రైతులకు జిల్లాలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీలను మూసివేసి పండించిన పంటను ఎక్కడికి సరఫరా చేయాలో తెలియని పరిస్థితి ఉందని బెల్లం రేట్లు కూడా మార్కెట్లో గిట్టుబాటు ధరలో రావడంలేదని అన్ని విధాలా తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారని నాగ జగదీశ్ అన్నారు.

జిల్లాలో 24 మండలాలకు గాను 18 మండలాల్లో తీవ్రమైన కరువు పరిస్థితులు ఉంటే ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. విలేకరుల సమావేశంలో అనకాపల్లి పట్టణ అధ్యక్షులు డాక్టర్ కే.కే.వి.ఏ. నారాయణ రావు, అనకాపల్లి పార్లమెంట్ జిల్లా ఆధికార ప్రతినిధి కడిమిశెట్టి నరసింగరావు (సింగ్) పాల్గొన్నారు.

క్షతగాత్రుడ్ని ఆసుపత్రికి తరలించి

మానవత్వం చాటుకున్న నగర డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ కార్యాలయం సమీపంలో ఉన్న తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వంతెనపై గురువారం హెచ్‌పిసిఎల్ ఉద్యోగులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అకస్మాత్తుగా వాహనంపై జారిపడగా ఒక వ్యక్తి ప్రమాదానికి గురై అకస్మారక స్థితికి లోనయ్యారు. అదే

సమయంలో అటుగా వెళుతున్న జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తమ వాహనాన్ని ఆపి ఆ వ్యక్తులను రక్షించేందుకు అంబులెన్స్ కి ఫోన్ చేసి ప్రమాదానికి గురై అపస్మారక స్థితిలో ఉన్న ఒక వ్యక్తిని కేజీహెచ్ కు తరలించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. తెలుగు తల్లి ఫ్లై ఓవర్ వంతెన పై ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా ఆ వాహనం స్కిడ్ అయినందున వారు కింద పడిపోయారని డిప్యూటీ మేయర్ తెలిపారు. ప్రమాదానికి గురైన వ్యక్తులలో ఒకరికి చేయి విరిగిందని, వెంటనే అంబులెన్స్ లో కేజీహెచ్‌కు తరలించామని డిప్యూటీ మేయరు తెలిపారు.

చంద్రబాబుకు ఆదరణతో వైసీపీలో వణుకు

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జనం గుండెల్లో చంద్రబాబు స్థిర స్థాయిగా ఉంటారని అందుకు నిదర్శనమే ఆయనకు నీరాజనాలు పలకడం చూసామని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు రాజమండ్రి నుంచి విజయవాడకు 14 గంటల సమయం పట్టడం చరిత్ర అన్నారు. హైదరాబాద్‌లో కూడా అదే ఆదరణ నిజమైన నాయకుడికి ఘనమైన స్వాగతం లభించిందన్నారు. వైసీపీ నేతలు జీర్ణించుకో లేకపోతున్నారని, జైలు నుంచి వచ్చిన చంద్రబాబు గురుంచి సజ్జల హీనంగా మాట్లాడడం దారుణం అన్నారు. ప్రభుత్వ పెద్దలు డాక్టర్‌తో వేర్వేరు రిపోర్ట్‌లు ఇప్పించారని, జైలులోనే చంద్రబాబు చస్తాడని వైసీపీ ఎంపీ మాట్లాడుతున్నాడన్నారు. దీన్ని బట్టి వైసీపీ నేతల పరిస్థితి అర్థం అవుతుందన్నారు. ఇంటర్నేషనల్ సదస్సు జగన్ విశాఖలో పెట్టుకున్నారని, పోలవరంతో పాటు ఒక్కటంటే ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టు కట్టలేదన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి సిగ్గు వదాలని, జగన్ గాల్లో వచ్చి గాల్లో వెళ్తారు, అయినా ప్రజల్ని ఇబ్బందులు పడుతున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఓ సీఎం కోసం ఏపీలో హెలి పాడ్ నిర్మిస్తున్నారని, జగన్‌కు సంబంధించి ఇది ఓ అరుదైన రికార్డ్ అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కేసు నిలబడదని తెలిసి సీఐడీ వాళ్ళు వేరే కేసులపై దృష్టి పెట్టారన్నారు.

వైసీపీ హయాంలో కల్తీ మద్యం వల్ల 35 లక్షలమంది అనారోగ్యం పాలయ్యారని, వేలాదిమంది చనిపోయారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో జగన్ సర్కార్ 99 శాతం విఫలమయ్యిందన్నారు.

ఈ మూడు నెలల్లో కూడా ఏమి చేసేది లేదని, మోడీకి మసాజ్ చేయడానికి ఢిల్లీ వెళ్తున్నాడు తప్ప ఏపీకి ఏమి ఉపయోగం లేదన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

జనసేన - టీడీపీ విజయం తథ్యం

తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జనసేన - తెలుగుదేశం పార్టీ కూటమి కలయికతో వచ్చే ఎన్నికలలో ప్రజా వ్యతిరేక పరిపాలన కొనసాగిస్తున్న వైసిపి గద్దె దిగక తప్పదని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పెందుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ శివశంకర్ జన్మదినం సందర్భంగా పెందుర్తిలో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బి.వి.రామ్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన వైయస్ జగన్మోహన్ రెడ్డి సర్కారు గద్దె దిగే సమయం ఆసన్నమైందన్నారు. ఈ కీలకమైన సమయంలో తెలుగుదేశం-జనసేన పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు యుద్ధంలో సైనికుల మాదిరిగా పనిచేయాల్సి ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలోను చూడని అరాచకాలు, నిర్బంధాలు కేవలం వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో మాత్రమే కనిపిస్తున్నా యన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎక్కడికి వెళ్లినా ప్రజలకు ఇబ్బందులు తప్పనిసరి పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యంగా గృహనిర్బంధాలు

సర్వసాధారణమైన విషయంగా మారిపోయాయని.. తాజాగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ విశాఖ పర్యటన సందర్భంగా తనను గృహ నిర్బంధం చేసేందుకు పోలీసులు తమ ఇంటికి వచ్చారని ప్రస్తావించారు. ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికీ భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందన్నారు. కానీ వైయస్ జగన్ పాలనలో కేవలం.. వైయస్ జగన్ భజన చేసే వారికి మాత్రమే భావ ప్రకటన స్వేచ్ఛ ఉందన్నారు. ప్రశ్నించే వారిని నిర్బంధించడం, దాడులు చేయడం, అరెస్టు చేయడం సర్వసాధారణ విషయంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలోనే జనసేన - తెలుగుదేశం కాంబినేషన్ సూపర్ హిట్ అవుతుంది అన్నారు.

25న విరాట్ హిందూ సంఘ్ సమ్మేళన మేళా

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: హిందూ ధర్మాన్ని పరిరక్షణ కోరుతూ ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక సంస్థ విరాట్ హిందూ సంఘ్ విశాఖలో మహా సమ్మేళనం నిర్వహిస్తోంది. నవంబర్ 25న నిర్వహించే ఆసమ్మేళనం బ్రోచర్ ను రాజ్య సభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు గురువారం విశాఖ బిజెపి కార్యాలయంలో విడుదల చేసారు. ఈ సందర్భంగా జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని పరిరక్షణ చేయాలని అన్నారు. ఉదయ నిధి స్టాలిన్ లాంటి వారు అవాకులు పేలుతున్నారని ఆగ్రహించారు. కార్యక్రమంలో విరాట్ హిందూ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్ వర్మ, మాట్లాడుతూ ఈ నెల 25 న ఎంవివి కాలనీ ఆళ్వార్ దాస్ స్టేడియం ఈ మహా సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ నాయకులు కె ఎన్ ఆర్, విరాట్ హిందూ సంఘ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

లావా బ్లేజ్ 2 5జి విడుదల

విశాలాంధ్ర - విశాఖపట్నం: పోటీ ధర వద్ద కట్టింగ్-ఎడ్జ్ ఫీచర్స్ అందించాలనే తన సిద్ధాంతానికి కట్టుబడి, లావా ఈరోజు కొత్త బ్లేజ్ 2 5జి ఫోన్‌ను రూ. 9,999/- కు ప్రవేశపెట్టింది. ఈ పరికరము ప్రీమియం గ్లాస్ బ్యాక్ విభాగములో మొట్టమొదటి రింగ్ లైట్ తో వస్తుంది. ఇది 3 ప్రకాశవంతమైన రంగులలో, గ్లాస్ బ్లాక్, గ్లాస్ బ్లూ గ్లాస్ లావెండర్ రంగులలో అందుబాటులో ఉంటుంది. ఈ తాజా స్మార్ట్ ఫోన్‌లో 3,90,000 కంటే ఎక్కువ ఏ ఎన్ టి యుటియు స్కోర్‌తో మెరుపు-వేగము కలిగిన మీడియాటెక్ డైమెన్సిటి 6020 ప్రాసెసర్ ఉంది. బ్లేజ్ 2 5జి రెండు వేరియంట్స్ లో అందుబాటులో ఉంటుంది (4ప్లస్4లి) జీబి/64జీబి (6ప్లస్6లి) జీబి/128జీబి యూఎఫ్?ఎస్ 2.2 మెమొరీ, 1 టిబి వరకు విస్తరించదగిందని లావా స్టోర్ మేనేజర్ చెప్పారు.

కట్టుపాలెంలో బాబు షూరిటీ..భవిష్యత్ గ్యారంటీ

విశాలాంధ్ర-యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కట్టుపాలెం గ్రామంలో గురువారం సాయంత్రం టిడిపి మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు, నియోజకవర్గ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు షూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు ప్రతీ ఇంటికి వెళ్తూ టిడిపి మ్యానిఫెస్టోని వివరించి చెప్పారు.

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని గెలిపించుకుని రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మాజీ ఎంపిపి కొలుకులూరి విజయ బాబు,జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాజాన సూర్య నాగేశ్వరరావు,టిడిపి నాయకులు పందూరి శ్రీనివాసరావు,కరణం రవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జరుగుతున్న అన్యాయానికి మంత్రులు సమాధానం చెప్పాలి

విశాలాంధ్ర - వి. మాడుగుల: మాడుగుల నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు జరుగుతున్న అన్యాయాలు, వాటి వెనుక ఎవరు వున్నారనే విషయంపై రాష్ట్ర మంత్రులు సమాధానం చెప్పాలని మాడుగుల తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు డిమాండ్ చేశారు. మంత్రులు బొత్స సత్యనారాయణ, బూడి సత్యనారాయణ, వైకాపా నేత సుబ్బారెడ్డి సామాజిక సాధికారిత యాత్ర పేరుతో మాడుగుల నియోజకవర్గంలో బస్సు యాత్ర చేస్తున్న సందర్భంగా మాడుగుల టిడిపి నాయకులు పైలా ప్రసాదరావును గృహ నిర్బందం చేశారు. వివిధ గ్రామాల్లో సాగుతున్న భూఅక్రమాలపై బాధితుల వినతిమేరకు వాటిని నేరుగా సాధికారత యాత్రలో మంత్రుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ మేరకు పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. ఉదయం నుంచి వివిధ కార్యక్రమాల్లో బందోబస్తు చేసి మంత్రుల యాత్రకు చేరకుండా పైలాతో సహా టిడిపి నేతలను, బాధితులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మోకాళ్ళపై టిడిపి నేతలు నిరసన వ్యక్తం చేసి బస్సు యాత్ర మోసపూరిత యాత్ర అంటూ నినాదాలు చేశారు. ఈ విషయమై పైలా ప్రసాదరావు మాట్లాడుతూ బాధితుల సమస్యలను వినిపించుకునే ధైర్యం, అవకాశం ఇవ్వలేని ..ఇదేమి సాధికారిత యాత్ర అని ప్రశ్నించారు. తెనుగుబూడిలో గ్రామ కంఠం భూమిని ఆక్రమించి, ఇల్లు అమ్ముకోవడానికి ప్రయత్నిస్తే తెలుగుదేశం ప్రతినిధులు కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారన్నారు. పింద్రంగిలో వైకాపా ఎంపిటిసి ప్రభుత్వ భూములను కబ్జా చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. పింద్రంగి ఎంపిటిసి ఆర్అండ్‌బి రోడ్డును ఆక్రమించి గృహ నిర్మాణం చేస్తున్నారని, గొందుపాలెంలో కుమ్మరి, రజక బీసీ కులాలకు చెందిన మాన్యం భూములను కబ్జా చేస్తున్నారన్నారు. దేవరాపల్లి మండలంలో పేదలకు గతంలో భూమి పట్టాలు ఇచ్చారని, వాటిని రద్దు చేసి వేరే వారికి ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో ఇలాంటి భూ అక్రమాలతో పాటు ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయని విమర్శించారు. ఈ సమస్యలను భాదితులు యాత్రలో మంత్రుల దృష్టికి తీసుకువెళ్ళే ప్రయత్నం చేస్తున్నారని, తాము బాధితులకు అండగా నిలుస్తున్నామనే అక్కసుతో గృహ నిర్బందంలో ఉంచుతున్నారని ఆయనన్నారు. రెండు దఫాలు ఎమ్మెల్యే అయిన బూడి ముత్యాల నాయుడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకపోగా, ఉన్న వనరులను, భూములను దోచిపెట్టి సొంత బాగు చూసుకుంటున్నారని ఆరోపించారు. ఈ అక్రమాల్లో ఎక్కువగా నష్టపోయిన ఎస్సీ,ఎస్టీ, బీసీ వర్గాలను సాధికారిత కల్పించామని మాయ యాత్రలు చేయడం సిగ్గుచేటు విషయమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాటం చెప్పడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి రాము, ఎం.కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, సింగన్నదొరపాలెం సర్పంచ్ వెలగల పైడం నాయుడు, సక్కెళ్ళ నాగమని, డాక్టర్ పాశ్వేటి పెంటారావు, కసిరెడ్డి గణపతి, తమదాన ప్రసాద్,పిల్లల రమణ,పెద గాడి శివ, బడబర్ల నాగేశ్వరరావు, ఎల్లపు రాము, లెక్కల సత్తిబాబు,కడిమి నాగేశ్వరావు, ఎల్లపు రాము, పేలూరి రాము, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం సీఐగా సంతోష్ కుమార్



విశాలాంధ్ర - గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామివారిని రాష్ట్ర దేవాదాయ శాఖ ఏడిసి కె.రామచంద్రమోహన్, గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ నూతన సిఐ సంతోష్ కుమార్ దంపతులు, బొబ్బిలి రాజా ఆర్.వి.ఎస్.కేకే రంగారావు బేబీ నాయన తదితరులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. వీరు కప్పస్థంభం ఆలింగనం అనంతరం స్వామివారికి తమ తమ గోత్రనామాలతో సంకల్పం చేయించారు. దర్శనానంతరం అధికారులు వేదపండితులచే ఆశీర్వవచనం చేయించి, స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేసారు. స్వామివారి దర్శన అనంతరం గోపాలపట్నం సిఐ బాధ్యతలు చేపట్టారు.

నాగేశ్వరరావు సేవలు మరువలేనివి

విశాలాంధ్ర - జికేవీధి: చింతపల్లి మండలం సాక్షి పత్రిక పాత్రికేయుడు ముక్కలి నాగేశ్వరరావు గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురవుతూ ఆరోగ్యం క్షీణించడంతో బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. గురువారం నాగేశ్వరరావు అంతక్రియలు ఆయన స్వగ్రామం గూడెంకొత్తవీధి గ్రామంలో నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు విశ్వేశ్వరరాజు నాగేశ్వరరావు అంతక్రియల్లో పాల్గని ఆయన భౌతిక కాయాన్ని పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విశ్వేశ్వరరావు మాట్లాడుతూ నాగేశ్వరావు గిరిజన ప్రాంతాల్లో ఉన్న సమస్యల పట్ల ఎండా వాననక అహర్నిశలు కష్టపడేవారన్నారు. అటువంటి పాత్రికేయుడు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) 43వ ఆవిర్భావ దినోత్సవం గురువారం అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దొడ్డు రామనాయుడు భవన్ వద్ద జరిగింది. ముందుగా డివైఎఫ్ఐ పతాకాన్ని డివైఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి వి.వి. శ్రీనివాసరావు,జిల్లా అధ్యక్షులు సి హెచ్, శివాజీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశం కోసం యువతకు, ఉపాధి ఉద్యోగరక్షణ, మెరుగైన విద్య తదితరాల కోసమే దేశంలో పనిచేస్తున్న ఏకైక యువజన సంఘం డివైఎఫ్ఐ అని కొనియాడారు. దేశంలో యువతకు ఉద్యోగాల నోటిఫి కేషన్లు విడుదల చేయాలని, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వాలు ఖాళీలను భర్తీ చేయడం లేదని అన్నారు. లక్షలాదిమంది నేడు ఉపాధి లేక అల్లాడుతుంటే యువతని మోసం చేయటమే ఈ ప్రభుత్వాల తీరుగా మారింది అన్నారు. దేశంలో భగత్ సింగ్, అల్లూరి వంటి నేతల స్ఫూర్తితో డివైఎఫ్ఐ

ఏర్పడిందని, మా దేహం ముక్కలైనా ఈ దేశాన్ని ముక్కలు కానివ్వమని విచ్ఛిన్నకర ఉద్యమాలకు వ్యతిరేకంగా పోరాడింద అన్నారు. యువత అంతా డివైఎఫ్ఐ లో చేరి భవిష్యత్ తరాలకు దిక్సూచిగా నిలవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 45 వేల పోస్టులతో డీఎస్సీను ప్రకటించాలన్నారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు ఎస్.రమణ, ఎమ్.రమణ, కే.సోము నాయుడు, నరసింహమూర్తి, గీత, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర - జికేవీధి: జికేవీధి మండలానికి వచ్చిన ఆయుష్మాన్ భారత్ కార్డులను జికేవీధి ఎంపిడిఓ ఉమామహేశ్వరావు గురువారం పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 8245 కార్డులు వచ్చాయన్నారు. వీటిని పంచాయతీ కార్యదర్శులకు అందించామన్నారు. ఆయా పంచాయతీల ప్రజాప్రతినిదుల చేత ఈ కార్డులను లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి పాల్గొన్నారు.